మరో ప్రజా సంకల్పం

బుధవారం, 21 అక్టోబరు 2026 | Evening News Bulletin | పేజీలు : 7

ప్రతి రోజూ సాయంత్రం మరో ప్రజాసంకల్పం ఈ-పేపర్‌లో వచ్చే సమాచారం కోసం
ఈ QR కోడ్‌ను స్కాన్ చేసి వాట్సాప్ ఛానల్‌లో జాయిన్ అవ్వండి.


పచ్చమూక అరాచకాలపై

సుప్రీం కొరడా

వైయస్సార్‌సీపీ న్యాయపోరాటంతో స్థానిక ఎన్నికలపై కీలక ఆదేశాలు

నామినేషన్లను అడ్డుకున్నారన్న ఫిర్యాదులు, వీడియో ఆధారాలను పరిగణనలోకి తీసుకున్న సర్వోన్నత న్యాయస్థానం

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా నామినేషన్లను అడ్డుకుంటున్నారంటూ వైయస్సార్‌సీపీ సాగిస్తున్న న్యాయపోరాటంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. అభ్యర్థులపై దాడులు, బెదిరింపులు, నామినేషన్ పత్రాల చించివేత, పోలీసుల వ్యవహారశైలిపై ఆ పార్టీ చేసిన ఫిర్యాదులు సుప్రీంకోర్టు ముందుకు చేరాయి. వీటికి సంబంధించి సమర్పించిన వీడియోలు, ఇతర ఆధారాలను పరిగణనలోకి తీసుకున్న సర్వోన్నత న్యాయస్థానం ఎన్నికల నిర్వహణపై పలు కీలక ఆదేశాలు జారీ చేసింది. వైయస్సార్‌సీపీ తన వాదనకు తగిన ప్రాథమిక ఆధారాలను సమర్పించిందని, ఈ దశలో తగిన ఆదేశాలు ఇవ్వడానికి ప్రాథమికంగా కేసు ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది. అక్టోబర్ 21న ప్రకటించాల్సిన అభ్యర్థుల తుది జాబితాను అక్టోబర్ 25 వరకు నిలిపివేయాలని ఆదేశించింది. నామినేషన్ల గడువు పాడిగింపుపై అక్టోబర్ 22లోగా నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి సూచించింది.



న్యాయ సమీక్షను నిరోధించలేరు

ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోందనే కారణంతో రాజ్యాంగ న్యాయస్థానాల న్యాయసమీక్ష అధికారాన్ని పూర్తిగా నిరోధించలేరని సుప్రీంకోర్టు స్పష్టం చేయడం ఈ విచారణలో అత్యంత కీలక అంశంగా నిలిచింది. స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలకు విఘాతం కలిగించే రాజ్యాంగ విరుద్ధమైన, చట్టవిరుద్ధమైన చర్యలు చోటుచేసుకుంటే న్యాయస్థానాలు జోక్యం చేసుకోవచ్చని పేర్కొంది. రాజ్యాంగ విలువలను పరిరక్షించాల్సిన బాధ్యత న్యాయస్థానాలపై కూడా ఉందని గుర్తుచేసింది. స్థానిక ఎన్నికల్లో అధికార కూటమి దౌర్జన్యాలకు పాల్పడుతోందంటూ వైయస్సార్‌సీపీ చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఈ పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

- మిగతా 2-3 పేజీల్లో..

- వైయస్సార్‌సీపీ వాదనకు ప్రాథమిక ఆధారాలున్నాయని ధర్మాసనం అభిప్రాయం
- అభ్యర్థుల తుది జాబితా ప్రకటనకు అక్టోబర్ 25 వరకు బ్రేక్
- నామినేషన్ల గడువు పొడిగింపుపై 22లోగా నిర్ణయం తీసుకోవాలని ఎన్నికల సంఘానికి ఆదేశం
- గడువు పొడిగిస్తే కనీసం 48 గంటల అవకాశం ఇవ్వాలని స్పష్టీకరణ
- అభ్యర్థులకు పోలీసు రక్షణ.. నామినేషన్ కేంద్రాల వద్ద బందోబస్తు, సీసీటీవీ నిఘా
- 63 శాతం మంది అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని వైయస్సార్‌సీపీ వాదన
- రాజ్యాంగ విరుద్ధమైన చర్యలతో ఎన్నికల స్వేచ్ఛకు విఘాతం కలిగితే న్యాయస్థానాలు జోక్యం చేసుకోవచ్చని వ్యాఖ్య
- సుప్రీంకోర్టులో వైయస్సార్‌సీపీ తరపున మణీందర్ సింగ్ వాదనలు
- ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అమలు నివేదికలు కోరిన ధర్మాసనం
- అక్టోబర్ 27న తదుపరి విచారణ

అదే దౌర్జన్యం.. అదే దాడులు

నామినేషన్లను అడ్డుకుంటూ ప్రజాస్వామ్యంపై కూటమి దాడి!

వైయస్ఆర్‌సీపీ అభ్యర్థులే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్బంధాలు, దాడులు, బెదిరింపులు

నామినేషన్ కేంద్రాల వద్ద అడ్డంకులు.. అభ్యర్థులు, నాయకులపై పోలీసుల ఒత్తిడి

తాడేపల్లి:

స్థానిక సంస్థల ఎన్నికల్లో వైయస్ఆర్‌సీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. పులివెందుల, పిడుగురాళ్ల, దాచేపల్లి, తిరుపతి, కడప సహా పలు ప్రాంతాల్లో అభ్యర్థులు, పార్టీ నాయకులపై దాడులు, బెదిరింపులు, గృహనిర్బంధాలు, నామినేషన్ పత్రాల దాఖలుకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల్లో పోటీ చేసే హక్కును కాలరాస్తూ భయానక వాతావరణం సృష్టించడం కూటమి పాలనలో ఎన్నికల ప్రక్రియ ఎదుర్కొంటున్న పరిస్థితికి నిదర్శనం.

- మిగతా 3-5 పేజీల్లో..

పచ్చమూక అరాచకాలపై సుప్రీం కొరడా

ప్రాథమిక ఆధారాలున్నాయన్న సుప్రీంకోర్టు

వైయస్సార్‌సీపీ దాఖలు చేసిన పిటిషన్‌లోని ఆరోపణలను, సమర్పించిన ఆధారాలను సుప్రీంకోర్టు పరిశీలించింది. నామినేషన్ల దాఖలుకు ఆటంకాలు ఎదురవుతాయంటూ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ప్రధాన ప్రతిపక్ష పార్టీ ఆందోళన వ్యక్తం చేసిన విషయాన్ని పరిగణనలోకి తీసుకుంది. అభ్యర్థులపై దాడులు, నామినేషన్లకు అడ్డంకులు, హింసాత్మక ఘటనలకు సంబంధించిన వీడియో క్లిప్పులు, ఇతర ఎలక్ట్రానిక్ ఆధారాలను పరిశీలించింది. ఈ దశలో వైయస్సార్‌సీపీ వాదనకు తగిన ప్రాథమిక ఆధారాలున్నాయని అభిప్రాయపడింది. ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోవద్దన్న సాధారణ న్యాయసూత్రాన్ని ప్రస్తావిస్తూనే, ఎన్నికల స్వేచ్ఛను దెబ్బతీసే పరిస్థితులు ఎదురైనప్పుడు న్యాయస్థానాలు చేతులు కట్టుకుని ఉండాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకోవడం ఎన్నికల నిష్పక్షపాతాన్ని ప్రభావితం చేసే అంశమని గుర్తుచేసింది. వైయస్సార్‌సీపీ లేవనెత్తిన సమస్యలపై ఎన్నికల సంఘం తగిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పింది.

తుది జాబితా ప్రకటనకు బ్రేక్

మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థుల తుది జాబితా ప్రకటనపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. అక్టోబర్ 21న ప్రకటించాల్సిన తుది జాబితాను అక్టోబర్ 25 వరకు వాయిదా వేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. నామినేషన్లు వేయలేకపోయిన అభ్యర్థుల ఫిర్యాదులను పరిశీలించడానికి, గడువు పొడిగింపుపై నిర్ణయం తీసుకోవడానికి ఈ ఆదేశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకుని అధికార పార్టీ అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా చేస్తున్నారన్నది వైయస్సార్‌సీపీ ప్రధాన ఆరోపణ. ప్రభావిత వార్డుల్లో అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కూడా ఆ పార్టీ కోరింది. ఈ నేపథ్యంలో తుది జాబితా ప్రకటనను నిలిపివేయాలన్న ఆదేశం కీలక పరిణామంగా మారింది.

48 గంటల గడువు ఇవ్వాల్సిందే

నామినేషన్ల గడువు పొడిగింపుపై అక్టోబర్ 22లోగా నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. శాంతిభద్రతల సమస్యల కారణంగా అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయలేకపోయిన ప్రాంతాల్లో గడువు పొడిగింపును పరిశీలించాలని సూచించింది. వైయస్సార్‌సీపీతోపాటు అభ్యర్థులు సమర్పించిన ఫిర్యాదులు, వీడియో ఆధారాలను పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది. గడువు పొడిగించాలని నిర్ణయిస్తే, ఆ నిర్ణయం ప్రకటించినప్పటి నుంచి కనీసం 48 గంటల సమయం ఇవ్వాలని ఆదేశించింది. అభ్యర్థులకు నామినేషన్లు దాఖలు చేసేందుకు వాస్తవంగా అవకాశం లభించేలా చూడాలన్నది ఈ ఆదేశాల ఉద్దేశం. గడువు పొడిగింపుపై నిర్ణయం తీసుకునే అధికారాన్ని ఎన్నికల సంఘానికే వదిలినప్పటికీ, అభ్యర్థుల ఫిర్యాదులను పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యతను సుప్రీంకోర్టు గుర్తుచేసింది.

ముందే గడువు పొడిగించవచ్చు కదా?

విచారణ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది కె.పరమేశ్వర్ వాదనలు వినిపించారు. ఎన్నికల నిర్వహణ పూర్తిగా ఎన్నికల సంఘం పరిధిలోని అంశమని, ఈ విషయంలో కోర్టు తప్పనిసరి ఆదేశాలు జారీ చేయరాదని కోరారు. ఈ సందర్భంగా జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి పలు కీలక అంశాలను ప్రస్తావించారు. నామినేషన్ల గడువును కనీసం ఒకరోజు పొడిగించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకునే ఉద్దేశంతో తప్పనిసరి ఆదేశాలు ఇవ్వడం లేదని స్పష్టం చేశారు. అయితే శాంతిభద్రతల ఉల్లంఘనలకు సంబంధించిన ఘటనలను ఎన్నికల సంఘమే గుర్తించి పోలీసు రక్షణకు ఆదేశించిన విషయాన్ని ప్రస్తావించారు. అక్టోబర్ 14న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగా, అక్టోబర్ 16నే నామినేషన్ల గడువు పొడిగించాలని వైయస్సార్‌సీపీ కోరిందని గుర్తుచేశారు. నిబంధనల ప్రకారం నోటిఫికేషన్ తేదీ నుంచి ఆరు రోజుల వరకు గడువు పొడిగించే అవకాశం ఉందని, కనీసం అక్టోబర్ 20 వరకు గడువు ఇచ్చి ఉండవచ్చని వ్యాఖ్యానించారు. మైదుకూరు మున్సిపాలిటీలో హింసపై వాస్తవమైన ఆందోళనలు ఉండటంతో అక్కడ ఎన్నికలను నిలిపివేసినట్లు ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది వివరించారు. వైయస్సార్‌సీపీ అక్టోబర్ 10న హైకోర్టును ఆశ్రయించినప్పటికీ, అక్టోబర్ 15న జరిగిన విచారణలో గడువు పొడిగింపు కోరలేదని వాదించారు.

పోలీసు రక్షణ.. సీసీటీవీ నిఘా

నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులకు అవసరమైన పోలీసు రక్షణ కల్పించాలని సుప్రీంకోర్టు డీజీపీని ఆదేశించింది. నామినేషన్ కేంద్రాల వద్ద తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని, సీసీటీవీ కవరేజీ ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. అభ్యర్థులు భయాందోళనలు లేకుండా నామినేషన్లు దాఖలు చేసే పరిస్థితులు కల్పించాలని పేర్కొంది. స్థానిక ఎన్నికల్లో ప్రతిపక్ష అభ్యర్థులకు రక్షణ కల్పించడంలో పోలీసు యంత్రాంగం విఫలమవుతోందని వైయస్సార్‌సీపీ ఆరోపిస్తున్న నేపథ్యంలో ఈ ఆదేశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లకు సంబంధించి ఎన్నికల సంఘం గతంలోనే ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని కూడా ధర్మాసనం ప్రస్తావించింది. సుప్రీంకోర్టు తాజా ఆదేశాల అమలుపై రాష్ట్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్లు సమర్పించాల్సి ఉంది.

63 శాతం మందిని అడ్డుకున్నారంటూ వాదనలు

వైయస్సార్‌సీపీ తరఫున సీనియర్ న్యాయవాది మణీందర్ సింగ్ సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. దాదాపు మూడింట రెండొంతుల మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డంకులు ఎదుర్కొన్నారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దాదాపు 63 శాతం మంది అభ్యర్థులు నామినేషన్లు వేయలేకపోయారని, ఫలితంగా ఆయా స్థానాల్లో అధికార పార్టీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యే పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు. నామినేషన్ పత్రాలను చించివేయడం, అభ్యర్థులను బెదిరించడం, హింసాత్మక ఘటనలకు సంబంధించిన వీడియోలు ఉన్నాయని కోర్టుకు తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాకముందే హింసపై ఆందోళన వ్యక్తం చేస్తూ హైకోర్టును ఆశ్రయించిన విషయాన్ని గుర్తుచేశారు. అభ్యర్థుల ఫిర్యాదులపై పోలీసులు నిర్లక్ష్యంగా, ఏకపక్షంగా వ్యవహరించారని ఆరోపించారు. ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని కాపాడేందుకు న్యాయస్థానాల జోక్యం అవసరమని వాదించారు.

ప్రభుత్వ వాదనలు.. వైయస్సార్‌సీపీ ప్రతివాదనలు

రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ్ లూథ్రా, ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. వైయస్సార్‌సీపీ చెబుతున్నంత సరళంగా పరిస్థితులు లేవని లూథ్రా పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా వైయస్సార్‌సీపీ కూడా హింసకు పాల్పడిందని ఆరోపించారు. పంజాబ్ నుంచి వ్యక్తులను తీసుకొచ్చి ఎన్నికల ప్రక్రియను దెబ్బతీసేలా హింస సృష్టించారని వాదించారు. మరో సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వైయస్సార్‌సీపీకి ఎన్నికల్లో పాల్గొనే ఆసక్తి లేదని, మీడియా ప్రచారం కోసమే ప్రయత్నిస్తోందని వాదించారు. ఈ వాదనలను వైయస్సార్‌సీపీ తరఫున మణీందర్ సింగ్ ప్రతిఘటించారు. తమ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, అందుకు సంబంధించిన వీడియో ఆధారాలు ఉన్నాయని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.

పుంగనూరు నుంచి తిరుపతి వరకు..

వైయస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి ద్వారా సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌లో పలు ప్రాంతాల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న ఘటనలను వివరించారు. అక్టోబర్ 16 నుంచి 18 వరకు కొనసాగిన నామినేషన్ల ప్రక్రియలో అభ్యర్థులపై దాడులు, బెదిరింపులు, అడ్డంకులు ఎదురయ్యాయని పేర్కొన్నారు. పుంగనూరు, రాయచోటి, కడప, తిరుపతి ప్రాంతాల్లో జరిగినట్లు చెబుతున్న హింసాత్మక ఘటనలను పిటిషన్‌లో ప్రస్తావించారు. కడపలో వైయస్సార్‌సీపీ అభ్యర్థి నామినేషన్ పత్రాలను లాక్కుని చించివేశారని ఆరోపించారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో తొమ్మిది మంది వైయస్సార్‌సీపీ అభ్యర్థులను రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లోకి వెళ్లకుండా అడ్డుకున్నారని వివరించారు. అభ్యర్థులతో కలిసి నామినేషన్లు వేయించేందుకు వెళ్తున్న వైయస్సార్‌సీపీ ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి కాన్వాయ్‌పై జరిగిన దాడిని కూడా పిటిషన్‌లో ప్రస్తావించారు. ఈ ఘటనల నేపథ్యంలో అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసేందుకు అవసరమైన రక్షణ కల్పించాలని కోరారు.

హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు..


స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాకముందే హింసాత్మక ఘటనలకు అవకాశం ఉందని వైయస్సార్‌సీపీ ఆందోళన వ్యక్తం చేసింది. జిల్లా కేంద్రాల్లో అదనపు నామినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించింది. అక్టోబర్ 15న హైకోర్టు సింగిల్ జడ్జి ఆ పార్టీ కోరిన విస్తృత ఉపశమనాన్ని నిరాకరించారు. వ్యక్తిగతంగా అభ్యర్థులు సంబంధిత ఎన్నికల అధికారులను ఆశ్రయించవచ్చని సూచించారు. అక్టోబర్ 16న జరిగిన ఘటనల అనంతరం నామినేషన్ల గడువు పొడిగించాలని వైయస్సార్‌సీపీ రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరింది. నామినేషన్ కేంద్రాల వద్ద భద్రత కల్పించాలని ఎన్నికల సంఘం ఆదేశించినప్పటికీ, గడువు పొడిగించలేదు. దీంతో వైయస్సార్‌సీపీ మరోసారి హైకోర్టును ఆశ్రయించింది. అక్టోబర్ 18న నామినేషన్ల గడువును ఒకరోజు పొడిగించాలన్న అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. గడువు ముగిసిన తర్వాత దానిని పొడిగించడం ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోవడమే అవుతుందని అభిప్రాయపడింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ వైయస్సార్‌సీపీ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జరిగిన విచారణలోనే తాజాగా కీలక ఆదేశాలు వెలువడ్డాయి.



ఎన్నికల్లో పోటీ చేసే అవకాశమూ ముఖ్యమే

స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలు రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో భాగమని సుప్రీంకోర్టు గుర్తుచేసింది. ఎన్నికల్లో పాల్గొనేందుకు నామినేషన్లు దాఖలు చేసే అవకాశం కూడా ఎన్నికల స్వేచ్ఛలో అంతర్భాగమని పేర్కొంది. ఎన్నికలను నిర్వహించడం, పర్యవేక్షించడం రాష్ట్ర ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధమైన బాధ్యత అయినప్పటికీ, అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసే పరిస్థితులు కల్పించడం కూడా ఆ బాధ్యతలో భాగమేనని స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియలో న్యాయస్థానాలు సాధారణంగా జోక్యం చేసుకోవని, అయితే రాజ్యాంగ విరుద్ధమైన, చట్టవిరుద్ధమైన చర్యలతో ఎన్నికల స్వేచ్ఛ దెబ్బతినే పరిస్థితుల్లో న్యాయసమీక్ష అధికారాన్ని పూర్తిగా నిరోధించలేరని పేర్కొంది. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు, అభ్యర్థులకు విశ్వాసం కల్పించడం రాజ్యాంగ ప్రజాస్వామ్య పరిరక్షణకు అత్యంత అవసరమని అభిప్రాయపడింది.

పచ్చమూక అరాచకాలపై సుప్రీం కొరడా



చంద్రబాబు ప్రభుత్వానికి ప్రశ్నలు

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్ష అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు అడ్డంకులు ఎదుర్కొంటున్నారని వైయస్సార్‌సీపీ చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాలు రాష్ట్ర ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి పలు ప్రశ్నలను ముందుంచాయి. అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు పోలీసు రక్షణ కల్పించాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడింది? నామినేషన్ కేంద్రాల వద్ద సీసీటీవీ నిఘా, పటిష్టమైన బందోబస్తు అవసరమని కోర్టు ప్రత్యేకంగా చెప్పాల్సి రావడానికి కారణాలేమిటి? నామినేషన్లకు అడ్డంకులు ఎదురవుతున్నాయని ఫిర్యాదులు వచ్చినప్పుడు ఎన్నికల సంఘం వాటిని ఏ విధంగా పరిష్కరించింది? అన్న అంశాలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. ప్రజల ఓట్లతో గెలవాలనుకుంటున్నారా.. ప్రతిపక్ష అభ్యర్థులను పోటీకి దూరం చేసి గెలవాలనుకుంటున్నారా.. అంటూ వైయస్సార్‌సీపీ చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోంది. ఎన్నికల్లో పోటీ చేయడానికి ముందుకొచ్చిన ప్రతి అభ్యర్థికీ సమాన అవకాశాలు ఉండాలని, అధికారంలో ఉన్న పార్టీకి మాత్రమే అనుకూలమైన పరిస్థితులు ఏర్పడితే ప్రజాస్వామ్య ఎన్నికల ఉద్దేశమే దెబ్బతింటుందని ఆ పార్టీ వాదిస్తోంది.

అక్టోబర్ 27న తదుపరి విచారణ

జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. వైయస్సార్‌సీపీ తరఫున అడ్వొకేట్ ఆన్ రికార్డ్ మహఫూజ్ ఎ. నజ్కీ ద్వారా పిటిషన్ దాఖలైంది. కేసు నంబరు SLP(C) No. 37476/2026. ఈ కేసుపై తదుపరి విచారణ అక్టోబర్ 27న జరగనుంది. అప్పటిలోగా రాష్ట్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాల అమలుపై అఫిడవిట్లు దాఖలు చేయాల్సి ఉంది. నామినేషన్ల గడువు పొడిగింపుపై అక్టోబర్ 22లోగా ఎన్నికల సంఘం తీసుకునే నిర్ణయం కీలకం కానుంది.

ప్రజల తీర్పే ప్రజాస్వామ్యానికి పునాది

స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లకు అడ్డంకులు ఎదురవుతున్నాయన్న ఆరోపణలను సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లిన వైయస్సార్‌సీపీ న్యాయపోరాటం ఇప్పుడు కీలక దశకు చేరుకుంది. పార్టీ సమర్పించిన ప్రాథమిక ఆధారాలను పరిగణనలోకి తీసుకుని సర్వోన్నత న్యాయస్థానం జారీ చేసిన ఆదేశాలు ఎన్నికల సంఘం, పోలీసు యంత్రాంగం బాధ్యతలను మరోసారి స్పష్టం చేశాయి. ఎన్నికల్లో గెలుపోటములను నిర్ణయించాల్సింది ప్రజలే. అభ్యర్థులు పోటీ చేయడానికి ముందుకొచ్చినప్పుడు వారికి సమాన అవకాశాలు కల్పించడం ఎన్నికల వ్యవస్థ బాధ్యత. నామినేషన్ దాఖలు చేసే అవకాశమే లేకపోతే ప్రజలకు తమ ప్రతినిధిని ఎన్నుకునే ప్రత్యామ్నాయాలు తగ్గిపోతాయి. అటువంటి పరిస్థితులు తలెత్తకుండా చూడాలన్నదే సుప్రీంకోర్టు ఆదేశాల్లోని ప్రధాన సందేశం. ఎవరు గెలవాలో ప్రజలు నిర్ణయించాలి.. ఎవరు పోటీ చేయాలో అధికారంలో ఉన్నవారు నిర్ణయించకూడదు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడమే ఇప్పుడు ఎన్నికల సంఘం, ప్రభుత్వ యంత్రాంగం ముందున్న ప్రధాన బాధ్యత.

అదే దౌర్జన్యం..అవే దాడులు

రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఘటనలు ఇలా..



పులివెందుల: వైయస్ఆర్‌సీపీ అభ్యర్థుల ఇళ్లపై దాడులు, వాహనాల దహనం ఘటనలను ఎంపీ వైయస్ అవినాష్‌రెడ్డి పరిశీలించారు. నామినేషన్లు వేయకుండా పార్టీ నాయకులను అరెస్టు చేస్తున్నారని ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.



వేంపల్లి: వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డిని పోలీసులు గృహనిర్బంధం చేశారు. మాజీ జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి ఇంటి వద్ద ఉద్రిక్తత నెలకొంది. నామినేషన్ కేంద్రానికి వెళ్తున్న అభ్యర్థులను పోలీసులు అడ్డుకోవడంతో మహిళలు రోడ్డుపై నిరసనకు దిగారు.



మార్కాపురం జిల్లా : పాదిలిలో వైయస్ఆర్‌సీపీ ఎంపీటీసీ అభ్యర్థి దొనపాటి శ్రావణిపై టీడీపీ వర్గీయులు దాడి చేసి, చీర లాగి, నామినేషన్ పత్రాలు చించివేసి గాయపరిచారని ఆరోపిస్తూ, వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి నిరసన



కర్నూలు జిల్లా ఆలూరు: ఎమ్మెల్యే బుసినే విరుపాక్షిని చిప్పగిరిలో పోలీసులు గృహనిర్బంధం చేశారు. ముందస్తు అరెస్టులతో అభ్యర్థులను భయపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.

అదే దౌర్జన్యం..అవే దాడులు



అనంతపురం జిల్లా : రాప్తాడు నియోజకవర్గంలో పరిటాల సునీత వర్గీయులు వైయస్ఆర్సీపీ అభ్యర్థుల నామినేషన్లను అడ్డుకోవడంతో పాటు, రాప్తాడులో పార్టీ నేతల ఇళ్లపై దాడులకు పాల్పడగా పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారు.



పిడుగురాళ్ల: జెడ్పీటీసీ అభ్యర్థి భారతి, ఆమె భర్త పెద్ద లక్ష్మారెడ్డిపై దాడి.. తీవ్రంగా గాయపడిన లక్ష్మారెడ్డిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలింపు



నాయుడుపేట : వైయస్ఆర్సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు నోటీసులు ఇస్తున్న ఎస్ఐ సుబ్రహ్మణ్యం



తిరుపతి జిల్లా : శ్రీకాళహస్తి మండలంలో ఎంపీ గురుమూర్తి, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నామినేషన్లు వేసేందుకు వెళ్తున్న వైయస్ఆర్సీపీ ఎంపీటీసీ అభ్యర్థులను అడ్డుకున్న టీడీపీ వర్గీయులు



పులివెందుల పట్టణం: పార్లపల్లి రోడ్డులో వైయస్ఆర్సీపీ కౌన్సిలర్ అభ్యర్థి శ్రీరాములు ఇంటి వద్ద ఉన్న ద్విచక్ర వాహనానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు.



సింహాద్రిపురం: ఎంపీటీసీ అభ్యర్థులను అడ్డుకున్న ఘటనపై పోలీసుల తీరును నిరసిస్తూ మహిళలు రోడ్డుపై బైఠాయింపు



నెల్లూరు జిల్లా : ఉదయగిరి నియోజకవర్గంలోని సీతారామపురంలో వైయస్ఆర్సీపీ ఎంపీపీ అభ్యర్థి చింతం రెడ్డి లోకేష్ ఎంపీటీసీ నామినేషన్ వేసేందుకు వెళ్తుండగా పోలీసులు అడ్డగింత



చిలకలూరిపేటలో వైయస్ఆర్సీపీ 47వ వార్డు అభ్యర్థి బెల్లంకొండ నరేంద్ర చౌదరి, కందుల శ్రీకాంత్ గౌడ్‌పై టీడీపీ వర్గీయులు దాడి చేసి బీ-ఫారాలను చించివేశారు. ఈ ఘటనలో నరేంద్ర అపస్మారక స్థితికి చేరగా, మున్సిపల్ ఆర్ఓ సమక్షంలో దాడి జరుగుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారు.

అదే దౌర్జన్యం..అవే దాడులు



శ్రీకాళహస్తి, రేణిగుంట: మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి గృహనిర్బంధ నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. రేణిగుంటలో వైయస్ఆర్‌సీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్‌లను కూడా గృహనిర్బంధం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. వైయస్సార్ సీపీ నాయకులపై దాడి.



కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం : తొండంగి మండలంలో దాడిశెట్టి రాజా వర్గానికి చెందిన వైయస్ఆర్‌సీపీ నాయకులను నామినేషన్లు వేయకుండా టీడీపీ నేత యనమల రాజేష్ వర్గీయులు అడ్డుకున్నట్లు సమాచారం.



పల్నాడు జిల్లా : రొంపిచర్లలో వైయస్ఆర్‌సీపీ కార్యకర్తలపై పోలీసుల లాఠీచార్జి.. పలువురికి గాయాలు.



ప్రొద్దుటూరు: మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఇంటి వద్ద పోలీసులు మోహరించారు. ఎంపీటీసీ నామినేషన్ల నేపథ్యంలో ఆయనను గృహనిర్బంధం చేసే అవకాశం ఉందని సమాచారం.



శ్రీకాళహస్తిలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి కుమారుడు ఆకర్ష్ రెడ్డిపై టీడీపీ వర్గీయుల దాడి



చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరు నియోజకవర్గంలోని కార్వేటినగరం నామినేషన్ కేంద్రం వద్ద వైయస్ఆర్‌సీపీ ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటూ టీడీపీ శ్రేణులు దాడి



పీలేరు, వాయల్పాడు:
మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కుమారుడు సాయికృష్ణారెడ్డి అరెస్టు

సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు: హింస జరిగిన 19 మున్సిపాలిటీల్లో నామినేషన్ల గడువు పెంపుపై నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది.వైయస్ఆర్‌సీపీ అభ్యర్థులకు భద్రత కల్పించాలని, జిల్లా కేంద్రాల్లో కలెక్టర్లు నామినేషన్లు స్వీకరించాలని, అక్టోబర్ 25 వరకు తుది అభ్యర్థుల జాబితా ప్రకటించవద్దని ఆదేశించింది.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తారా?

- ఏపీలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం!
- హింస జరిగిన 19 మున్సిపాలిటీల్లో నామినేషన్ల గడువు పొడిగింపుపై నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆదేశం
- వైయస్ఆర్సీపీ అభ్యర్థులకు భద్రత కల్పించాలి
- జిల్లా కేంద్రాల్లో కలెక్టర్లు నామినేషన్లు స్వీకరించాలి



తాడేపల్లి: ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా చోటుచేసుకున్న హింస, అవకతవకల వ్యవహారంపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. హింస జరిగిన 19 మున్సిపాలిటీల్లో నామినేషన్ల గడువు పొడిగింపుపై అదే రోజు నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. వైయస్ఆర్సీపీ అభ్యర్థులకు భద్రత కల్పించాలని పోలీసు అధికారులకు సూచిస్తూ, జిల్లా కేంద్రాల్లో కలెక్టర్లు నామినేషన్లు స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ నెల 25 వరకు అభ్యర్థుల తుది జాబితా ప్రకటించవద్దని కూడా ఆదేశించింది.

ప్రజాస్వామ్య పరిరక్షణ మా బాధ్యత

విచారణ సందర్భంగా ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఒక్క పోలీసు ఫిర్యాదు కూడా అందలేదని ప్రభుత్వం చెబుతున్న పరిస్థితి ఎంత తీవ్రమైనదో అర్థమవుతోందని వ్యాఖ్యానించింది. హింస జరుగుతూ, శాంతిభద్రతలు లేకపోతే అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి ఎలా ముందుకొస్తారని ప్రశ్నించింది. ప్రజాస్వామ్యంలో అన్ని పార్టీలకు సమాన అవకాశాలు కల్పించే సమతల పోటీ వాతావరణం ఉండాలని, ప్రతిపక్షాలకు కూడా ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉండాలని స్పష్టం చేసింది.

దాడులు చేసి బాధితులపైనే కేసులా?

వైయస్ఆర్సీపీ నేతలపై దాడులు చేసి, తిరిగి వారిపైనే కేసులు నమోదు చేస్తున్నారని పార్టీ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. బాధితుల ఫిర్యాదులను పోలీసులు స్వీకరించడం లేదని, 19 మున్సిపాలిటీల్లో వైయస్ఆర్సీపీ నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డంకులు సృష్టించారని వాదించారు. నామినేషన్ కేంద్రాల్లోకి వెళ్లనివ్వకుండా అడ్డుకోవడంతో పాటు, సిట్టింగ్ ఎంపీ కారుపై దాడి చేసి రాళ్లు విసిరిన ఘటనను కూడా ప్రస్తావించారు. దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, బాధితులపైనే కేసులు పెట్టడం ఎన్నికల ప్రక్రియపై తీవ్ర ప్రభావం చూపుతోందని వివరించారు.

నిష్పక్షపాత ఎన్నికలే ప్రజాస్వామ్యానికి ప్రాణం

ఎన్నికల్లో పోటీ చేయడం ప్రతి అభ్యర్థికి ఉన్న ప్రజాస్వామ్య హక్కు. భయం, బెదిరింపులు, దాడులు, నామినేషన్లకు అడ్డంకుల మధ్య ఎన్నికలు జరిగితే సమాన అవకాశాల సూత్రానికే విఘాతం కలుగుతుంది. సుప్రీంకోర్టు ఆదేశాల అమలు ద్వారా వైయస్ఆర్సీపీ అభ్యర్థులకు భద్రత, నామినేషన్ల దాఖలుకు అవకాశం కల్పించడంతో పాటు, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పెనుకొండలో నామినేషన్ పత్రాలను చించేసిన టీడీపీ నేతలు

- ధర్నాకు దిగిన మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్



శ్రీ సత్యసాయి జిల్లా: పెనుకొండ నియోజకవర్గంలో ఎన్నికల నామినేషన్ల సందర్భంగా ఉద్రిక్తత నెలకొంది. కురుబవాండ్లపల్లికి చెందిన వైయస్ఆర్సీపీ ఎంపీటీసీ అభ్యర్థి నామినేషన్ పత్రాలను టీడీపీ నేతలు చించివేసినట్లు సమాచారం. ఈ ఘటనకు నిరసనగా పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ ధర్నా చేపట్టారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల హక్కులను అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొంటూ, ఘటనకు బాధ్యులైన టీడీపీ నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

తునిలో నామినేషన్ల అడ్డగింత

- కాకినాడ జిల్లా తొండంగి మండలంలో వైయస్ఆర్సీపీ అభ్యర్థులను అడ్డుకుంటున్న కూటమి నాయకులు



కాకినాడ జిల్లా: తుని నియోజకవర్గంలోని తొండంగి మండలంలో నామినేషన్ల దాఖలు సందర్భంగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. వైయస్ఆర్సీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా కూటమి నాయకులు అడ్డుకుంటున్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి దాడిశెట్టి రాజా పార్టీ కార్యకర్తలతో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో తోపులాటలు చోటుచేసుకున్నాయి. ఈ పరిణామాల మధ్య పోలీసులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారని వైయస్ఆర్సీపీ వర్గాలు మండిపడ్డాయి. అభ్యర్థులు ఎలాంటి అడ్డంకులు లేకుండా నామినేషన్లు దాఖలు చేసేలా పోలీసులు తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

చిత్తూరులో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామిపై దాడి!

జడ్పీ చైర్మన్ కార్యాలయం వద్ద ఘటన

చిత్తూరు జిల్లా: జడ్పీ చైర్మన్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. పెనుమూరు జడ్పీటీసీ నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చిన మాజీ ఉప ముఖ్యమంత్రి, వైయస్ఆర్సీపీ సీనియర్ నాయకుడు నారాయణస్వామిపై టీడీపీకి చెందిన వ్యక్తులు దాడి చేశారు. ఎన్నికల నామినేషన్ల సందర్భంగా చోటుచేసుకున్న ఈ ఘటన కలకలం రేపింది. నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చిన నాయకులపై దాడులు జరగకుండా పోలీసులు తగిన భద్రత కల్పించి, ఘటనపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉంది.



చంద్రగిరిలో వైయస్ఆర్సీపీ నాయకులపై దాడి

- మాజీ ఎంపీటీసీ మదన్‌రెడ్డి సహా ముగ్గురిపై దాడి



తిరుపతి జిల్లా: చంద్రగిరిలో వైయస్ఆర్సీపీ నాయకులపై దాడి ఘటన కలకలం రేపింది. మాజీ ఎంపీటీసీ మదన్‌రెడ్డి, తొండవాడకు చెందిన రాము, లోకేష్‌పై టీడీపీకి చెందిన వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటనలో ముగ్గురి తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పెనుకొండలో వైయస్ఆర్సీపీ ఎన్నికల సమరానికి సిద్ధం

- మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి వాల్మీకి శ్రీనివాసులుతో పాటు 23 మంది కౌన్సిలర్ అభ్యర్థులకు ఫారం-బి అందజేత



శ్రీ సత్యసాయి జిల్లా: పెనుకొండ నియోజకవర్గంలో వైయస్ఆర్సీపీ ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేసింది. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పెనుకొండలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి వాల్మీకి శ్రీనివాసులు (జంపు శ్రీనివాసులు) తో పాటు 23 మంది కౌన్సిలర్ అభ్యర్థులకు మాజీ మంత్రి, వైయస్ఆర్సీపీ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ ఫారంబి పత్రాలను అందజేశారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ఎన్నికల బరిలో నిలుస్తున్న అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ నాయకత్వంలో ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో అభ్యర్థులు ఎన్నికల కార్యాచరణకు సిద్ధమయ్యారు.

రైల్వే కోడూరు నామినేషన్ కేంద్రం వద్ద ఎమ్మెల్యే అరవ శ్రీధర్ హల్‌చల్

- మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు నిరసన



రైల్వేకోడూరు: ఎంపీడీవో కార్యాలయంలోని నామినేషన్ కేంద్రం వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎమ్మెల్యే అరవ శ్రీధర్, జనసేన నాయకులు తమ అనుచరులతో కలిసి వైయస్ఆర్సీపీ అభ్యర్థులను నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డు కుంటూ, పార్టీ సానుభూతిపరులపై దాడులకు దిగుతున్నారని వైయస్ఆర్సీపీ నేతలు ఆరోపించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర కార్యనిర్వాహక మండలి సభ్యుడు రామిరెడ్డి ధ్వజారెడ్డి, సీనియర్ నాయకుడు తోట శివసాయితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా నామినేషన్ కేంద్రానికి చేరుకుని నిరసన చేపట్టారు. వైయస్ఆర్సీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే వరకు అక్కడి నుంచి కదిలేది లేదని పోలీసులకు తేల్చిచెప్పారు.

పోలీసు అమరవీరులకు వైయస్ జగన్ నివాళులు



తాడేపల్లి: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా వైయస్ జగన్ పోలీసు అమరవీరులకు నివాళులు అర్పించారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు సిబ్బందికి హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నాను. సమాజం కోసం వారు ప్రదర్శించిన ధైర్యసాహసాలు, అంకితభావం, నిస్వార్థ సేవలు చిరస్మరణీయం. ప్రజల రక్షణ కోసం వారు చేసిన అత్యున్నత త్యాగాలను ఎప్పటికీ మరువలేం. అమరవీరుల శౌర్యం, త్యాగాలు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందికి నిరంతరం స్ఫూర్తినివ్వాలి. ప్రజలను రక్షించడంలో, శాంతిభద్రతలను పరిరక్షించడంలో పోలీసులు అత్యున్నత ప్రమాణాలను పాటించాలి. నిజాయితీ, ధైర్యం, అంకితభావంతో ప్రజలకు సేవ చేయాలన్న స్ఫూర్తిని పోలీసు అమరవీరుల నుంచి పొందాలి అని వైయస్ జగన్ పేర్కొన్నారు.

సుప్రీంకోర్టు ఆదేశాలు ప్రభుత్వానికి చెంపపెట్టు

- **న్యాయస్థానం ఆదేశాలను స్వాగతించిన వైయస్ఆర్‌సీపీ సీనియర్ నేతలు**



తాడేపల్లి: 19 మున్సిపాలిటీల్లో నామినేషన్ల స్వీకరణకు మరో అవకాశం కల్పించడాన్ని వైయస్ఆర్‌సీపీ సీనియర్ నేతలు స్వాగతించారు. నామినేషన్ల అడ్డగింతలు, దాడుల నేపథ్యంలో సుప్రీంకోర్టు జోక్యం ప్రజాస్వామ్య పరిరక్షణకు కీలకమని పేర్కొన్నారు. అభ్యర్థులకు భద్రత కల్పించి, నామినేషన్లు వేసేందుకు సమాన అవకాశాలు కల్పించాలని, పోలీసు, రెవెన్యూ అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్టప్రకారం విధులు నిర్వర్తించాలని కోరారు.

సుప్రీంకోర్టు ఆదేశాలు ప్రభుత్వానికి చెంపపెట్టు:

పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే, వైయస్ఆర్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్

సుప్రీంకోర్టు తీర్పు ప్రజాస్వామ్యాన్ని కాపాడే గొప్ప చర్య. 19 మున్సిపాలిటీల్లో నామినేషన్ల స్వీకరణకు మరో అవకాశం కల్పించడాన్ని స్వాగతిస్తున్నాం. అభ్యర్థులను అడ్డుకోవడం ఆపి, అందరికీ సమాన అవకాశాలు కల్పించాలి. నామినేషన్లు స్వీకరించకపోతే కలెక్టర్లను ఆశ్రయిస్తాం; అవసరమైతే న్యాయపోరాటం కొనసాగిస్తాం.

సుప్రీం తీర్పు చూసైనా చంద్రబాబు కళ్లు తెరవాలి:

పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, వైయస్ఆర్‌సీపీ లోక్‌సభా పక్ష నేత

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అభ్యర్థులకు భద్రత కల్పించి, కలెక్టర్ల సమక్షంలో నామినేషన్లు స్వీకరించాలి. నామినేషన్ల అడ్డగింతలు, మహిళలపై దాడులు, కక్షపూరిత రాజకీయాలకు ప్రభుత్వం స్వస్తి పలకాలి. అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి. ప్రతి అభ్యర్థికి నామినేషన్ వేసే అవకాశం కల్పించి, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలి.

ఎన్నికలు సజావుగా జరుగుతున్నాయని చంద్రబాబు ఇప్పుడు చెప్పగలడా?:

భూమన కరుణాకర్‌రెడ్డి, వైయస్ఆర్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్

రాష్ట్రంలో ఎన్నికలు సజావుగా జరుగుతున్నాయని చెబుతున్న చంద్రబాబు ప్రభుత్వం, నామినేషన్ల ప్రక్రియలో హింసాత్మక పరిస్థితులపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఎందుకు వచ్చిందో సమాధానం చెప్పాలి. నామినేషన్ల అడ్డగింతలు, దాడులకు సంబంధించిన ఆధారాలను న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లాం. ఎన్నికల సంఘం, పోలీసు అధికారులు నిష్పాక్షికంగా వ్యవహరించి, ప్రతి అభ్యర్థికి సమాన అవకాశం కల్పించాలి.

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ అదే దౌర్జన్యం!

- **నామినేషన్ల అడ్డగింత.. పత్రాల చించివేత.. మహిళలపైనా దాడులు**
- **వెన్నుపోటు పార్టీ తీరుపై వైయస్సార్ సీపీ నేతల ఫైర్**
- **స్వేచ్ఛగా నామినేషన్లు వేసే వాతావరణం కల్పించాలని, రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ ఈ సీ)కు వైయస్ఆర్‌సీపీ నేతలు వినతిపత్రం అందజేత**



విజయవాడ: జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలోనూ మున్సిపల్ ఎన్నికల తరహాలోనే అభ్యర్థులకు అడ్డంకులు ఎదురవుతున్నాయని వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, నామినేషన్ పత్రాలను చించివేయడం, మహిళలపై దాడులకు పాల్పడటం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, శాంతిభద్రతలను కాపాడుతూ అభ్యర్థులకు రక్షణ కల్పించాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వైయస్ఆర్‌సీపీ నేతలు వినతిపత్రం అందజేశారు. అనంతరం పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు మీడియాతో మాట్లాడారు. మీడియాతో వారు ఏమన్నారంటే..

సుప్రీంకోర్టు ఆదేశాలను స్వాగతిస్తున్నాం : కల్పలతారెడ్డి, ఎమ్మెల్సీ

"మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్లను అడ్డుకున్నట్లుగానే ప్రస్తుతం జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ నామినేషన్ల ప్రక్రియకు అడ్డంకులు సృష్టిస్తున్నారు. కడప, అనంతపురం, నంద్యాల, కర్నూలు సహా పది జిల్లాలకు పైగా నామినేషన్లను అడ్డుకోవడం, పత్రాలను చించివేయడం, మహిళల పట్ల దురుసుగా వ్యవహరించడం జరుగుతోంది. ఈ పరిస్థితులపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశాం. ఎన్నికల సంఘం సకాలంలో స్పందించకపోవడం వల్లే సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. 19 మున్సిపాలిటీల్లో నామినేషన్లను స్వీకరించాలని, అభ్యర్థులకు 45 గంటల గడువు కల్పించాలని, ఈ నెల 25వ తేదీ వరకు తుది జాబితాను ప్రకటించకూడదని, నామినేషన్లు వేసేందుకు వెళ్లే అభ్యర్థులకు రక్షణ కల్పించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ ఆదేశాలను స్వాగతిస్తున్నాం" అని ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి స్పష్టం చేశారు.

సుప్రీంకోర్టు తీర్పు ప్రజాస్వామ్య పరిరక్షణలో చారిత్రాత్మకం: టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే.

"సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు భారత ప్రజాస్వామ్య చరిత్రలో చారిత్రాత్మక ఘట్టం. 19 మున్సిపాలిటీల్లో వైయస్ఆర్‌సీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారు. పిడుగురాళ్ల, గురజాల వంటి ప్రాంతాల్లో ఒక్క వార్డులో కూడా నామినేషన్ వేయనివ్వలేదు. పలు మున్సిపాలిటీల్లో పరిమిత సంఖ్యలోనే నామినేషన్లు దాఖలు చేయగలిగాం. పోలీసు వ్యవస్థ వైఫల్యం, ఎన్నికల ప్రక్రియలో జరిగిన అక్రమాలకు సుప్రీంకోర్టు తీర్పు అద్దం పట్టింది. ఈ పరిస్థితులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నైతిక బాధ్యత వహించి, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు రాజీనామా చేయాలి. డీజీపీ, హోంమంత్రి కూడా రాజీనామా చేయాలి. శాంతిభద్రతలను కాపాడటంలో విఫలమైన పోలీసు అధికారులను ఎన్నికల విధుల నుంచి తప్పించాలి" అని టీజేఆర్ సుధాకర్‌బాబు తేల్చి చెప్పారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను కలిసిన వారిలో వైయస్ఆర్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.మనోహర్‌రెడ్డి, పార్టీ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్‌రెడ్డి, గ్రివెన్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అంకంరెడ్డి నారాయణమూర్తి, ఎస్సీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యోహాన్ రాజు, బొందిలి విభాగం నాయకుడు నరేంద్రసింగ్ తదితరులు ఉన్నారు.

మున్సిపల్ ఎన్నికల నాటి అరాచకాలే జెడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్లలోనూ పునరావృతం :లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ.

"మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అక్రమాలు, అప్రజాస్వామిక చర్యలు జరిగాయో, ఇప్పుడు జెడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియలోనూ అవే పునరావృతమవుతున్నాయి. కడపలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి నేతృత్వంలో నామినేషన్లు వేసేందుకు వెళ్తున్న అభ్యర్థులను పోలీసులే అడ్డుకుంటున్నారు. నామినేషన్లు వేయడానికి కార్యాలయాల్లోకి వెళ్లేందుకు ప్రయత్నించిన మహిళా అభ్యర్థుల చేతుల్లోని పత్రాలను లాక్కొని చించివేస్తున్నారు. మదనపల్లిలో బారికేడ్లు ఏర్పాటు చేసి ఒక్క అభ్యర్థి కూడా నామినేషన్ వేయలేని పరిస్థితి కల్పించారు. అనంతపురం, చిత్తూరు, తిరుపతి, కర్నూలు, పల్నాడు జిల్లాల్లోనూ అభ్యర్థులపై దాడులు జరుగుతున్నాయి. కొందరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఎన్నికల సంఘానికి పలుమార్లు ఫిర్యాదు చేసినా న్యాయం జరగకపోవడంతోనే సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. అత్యున్నత న్యాయస్థానం జోక్యం చేసుకుని ప్రజాస్వామ్య పరిరక్షణకు తీర్పు ఇవ్వడం వైయస్ఆర్‌సీపీ విజయంగా కాకుండా ప్రజాస్వామ్య విజయంగా భావిస్తున్నాం. ఎన్నికల సంఘం ఇప్పటికైనా కళ్లు తెరిచి, స్వేచ్ఛగా నామినేషన్లు వేసే వాతావరణం కల్పించాలి.

Social Buzz

